సమృద్ధిగా, సంపదలతో, ద్వేష రహితంగా శాంతిగా జీవించాలని ఆశీర్వదించినట్లే. ఇది మీకు సమంజసంగా లేదంటే నా ఆశీర్వచనాన్ని వెనక్కి తీసుకుంటాను.” చెప్పాడా మహాత్ముడు.

అది సమంజసమైన ఆశీర్వచనమే అని ఆ గ్రామస్థులంతా తృప్తి పడ్డారు.

## 124. రెక్కలు

పూర్వం దేవుడు జంతువులని, పక్షులని సృష్టించాక తన దగ్గరున్న బరువు బాధ్యతలని భూమి మీద ఓ చోటి నించి మరో చోటికి పంపదలిచాడు. దాంతో ఆయన జంతువులన్నిటినీ పిలిచి వారిలో ఎవరు ఆ బరువు బాధ్యతలని మరో ప్రదేశానికి తీసుకెళ్తారని అడిగాడు.

“అది నాకు చాలా చిన్న పని. ఇంకేదైనా పెద్ద పనిని చెప్పండి చేస్తాను.” చెప్పింది ఏనుగు.

“అది మృగరాజునైన నా గౌరవానికి తగ్గ పని కాదు.” సింహం నిరాకరించింది.

“అది నేను మోయలేని బరువు.” కుందేలు చెప్పింది.

“నేను అంత దూరం వెళ్ళలేను.” తాబేలు చెప్పింది.

ఇలా ప్రతీ జంతువూ ఏవో అభ్యంతరాలు చెప్పి తప్పించుకున్నాయి. చివరకి పక్షులని పిలిచి ‘మీరు చేసిపెడతారా?’ అని వాటిని అడిగాడు దేవుడు.

“తప్పకుండా. మేం చిన్న జీవులమే అయినా నీకు సహాయం చేస్తాము. ఐతే వాటిని చిన్న చిన్నవిగా చేసి మా వీపులకి కడితే సాధ్యమైనంత వేగంగా నడుచుకుంటూ వెళ్ళి వాటిని గమ్యానికి చేరుస్తాం.” విన్నవించాయి పక్షులు.

“అలాగే. నేను అక్కడ మీకోసం వేచివుండి వీటిని దింపుకుంటాను.” చెప్పాడు దేవుడు.

దేవుడు ప్రతీ పక్షి వీపు మీద అది మోయగలిగినంత బరువు బాధ్యతలని కట్టాడు. వాటికి రెక్కలు లేవు కాబట్టి అవన్నీ పాటలు పాడుకుంటూ, చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ నడవసాగాయి. రోజు రోజుకీ వాటికి బరువు తగ్గిన

భావన కలగసాగింది. చివరకి అవన్నీ తమ గమ్యానికి చేరుకున్నాక తమ వీపు మీది బరువుని దింపాలనుకుని చూస్తే, అక్కడ దేవుడు కట్టిన బరువులు మాయం అయి ఆ స్థానంలో రెక్కలు మొలిచాయి.

"ఇదేమిటి? మాకీ రెక్కలు ఎలా వచ్చాయి?" ఆశ్చర్యంగా అవి తమ కోసం వేచివున్న దేవుడ్ని అడిగాయి.

"ఎవరైతే ఇతరుల బరువు బాధ్యతలని మోస్తారో అవి వారికి రెక్కలుగా మారి, నా దగ్గరకి ఎగిరి వచ్చే అవకాశాన్ని ఇస్తాయి. ఎవరైతే తమ బరువు బాధ్యతలని కూడా మోయరో వారు అధోగతికి వెళ్తారు." దేవుడు వాళ్ళకి వివరించాడు.

ఆ పక్షులన్నీ ఆనందంగా ఆకాశంలో ఎగరసాగాయి.

## 125. లాభం

హరి కథలు చెప్పే ఒకతనికి ఓ రోజు ఓ ఆలోచన కలిగింది. దాన్ని అతను తక్షణం ఆచరణలోకి పెట్టాడు. చాలా ఆధ్యాత్మిక కథలని రాసాడు. ప్రచురణకర్తలు ఆ కొత్త రచయిత కథలని ప్రచురించడానికి ముందుకు రాకపోవడంతో అతనే వాటిని ఓ పుస్తకంగా ముద్రించాడు. మొత్తం వెయ్యి కాపీలు వేసాడు. యఅతనికి తెలిసిన వాళ్ళంతా కొనడంతో నెలలోగా రెండు వందల కాపీలు అమ్ముడయ్యాయి. ఏడాది తిరిగాక స్టాకు లెక్క చూసుకుంటే ఏడు వందల కాపీలు ఇంట్లో మిగిలాయి. అతని పెట్టుబడి సగం కూడా రాలేదు.

పడుక్కోబోయే ముందు అతన్ని దేవుడికి ఇలా మొరపెట్టుకున్నాడు.

"ఇదేమిటి స్వామి? నీ మీద ప్రేమతో కదా ఆ పుస్తకం రాసి నేను ప్రచురించింది? నిన్ను ప్రేమించేవాళ్ళు కొంటారనుకున్నాను కాని అలా జరగలేదు. నేను నష్టపోయే చెడ్డ పని చేసానని నా భార్యతో సహా అంతా అంటున్నారు."

ఆ రాత్రి కలలో అతని ఇష్ట దైవం కనిపించి చెప్పాడు.

"నువ్వు చేసిన పని మంచి పనే. బాహ్య వ్యాపారంలో లెక్కలు చూసుకోకు. వాటిని చదవాల్సిన వారందరికీ ఆ పుస్తకాలు అందాయి. అదే నీ లాభం."